# ఆయాసం

-చంద్రం

రద్దీ కూడలిలో ఒక అమర జీవుని పేరిట వెలసిన సెంటర్‌లో వేదిక ఏర్పాటు చేసారు. రంగు కాగితాల తోరణాలతో, విద్యుద్దీపాల కాంతితో వేదిక దేదీప్యమానంగా వెలిగిపోతోంది. షామియానా కింద, ఉచితాసనాలపై ఆహూతులైన పెద్దలు సుఖాసీనులై వున్నారు.

సభాధ్యక్షులు స్థానిక శాసనసభ్యులు భిక్షాలుగారు.

సభా ప్రారంభకులు రాష్ట్రమంత్రి లోకనాధంగారు.

ముఖ్యఅతిధి కేంద్రమంత్రి జగన్నాధంగారు.

మంత్రులు వేంచేసారు కనుక పోలీసు బందోబస్తు గట్టిగా జరిగింది.

నాలుగువైపులా ట్రాఫిక్ బందు చేసారు.

రంగుదీపాల అలంకరణ మధ్య 'ఆయాసం అవతరణ ఉత్సవాలు' అనే బోర్డు చూపురుల దృష్టిని చిత్రంగా ఆకర్షిస్తోంది.

ఆయాసం అంటే ఆంధ్ర యాచకుల సంఘం అట.

ఉన్నంతలోనే పరిశుభ్రమైన దుస్తులు ధరించిన యాచక సభ్యులు వేదిక చుట్టూ గుమిగూడి ఉన్నారు. సభ్యులుకాని ఇతరులు కూడా చాలామంది ఉపన్యాసాలు వినడం కోసం అక్కడ చేరారు. నాలుగైదు రోజుల్నుంచీ మైకుల్లో రొదపెట్టి ప్రచారం చేసిన కారణంగా జనం బాగానే పోగయ్యారు.

యాచక వలంటీర్లు హడావుడిగా తిరుగుతున్నారు. కొందరి చేతుల్లో వారి డిమాండ్లకు సంబంధించిన నినాదాలు రాసిన బ్యానర్లు వున్నాయి.

కరపత్రాలు మరియు నినాదాల రచయిత జశ్వేరా (జులపాల శ్వేతాంబరరావు) లాల్చీ పైజమాలలో వేదిక పరిసరాలలోనే హడావుడి పడిపోతున్నాడు.

కరపత్రం ఒక్కొంటికీ వంద రూపాయలు నిదానం ఒక్కొంటికీ పది రూపాయల చొప్పున మార్కెట్ రేటుననుసరించి ప్రతిఫలం స్వీకరించినప్పటికీ ప్రూఫులు దిద్దడంలో నిస్వార్థంగానే సహకరించాడు జశ్వేరా. పైగా ఆయాసంయొక్క ఆశయాల గురించి సభావేదికపై కవితా భాషలో ఉచితంగా ప్రసంగించగలనని కూడా హామీ ఇచ్చి వున్నాడు. అయితే అతని మాటల్లోని అంతరార్థాన్ని గ్రహించలేని సభా నిర్వాహకులు అలాగే అన్నారుగానీ వేదికపైన జశ్వేరాకి కుర్చీ ఏర్పాటు చేయలేదు. అది గ్రహించిన జశ్వేరా నిరుత్సాహ పడిపోకుండా సమయం చూసి కుర్చీ సంగతి గుర్తు చేసాడు. అయినా అప్పటికే వేదిక ఇరుకైపోయిన కారణంగా జశ్వేరాకి ఆసనయోగం తప్పిపోయింది. కనీసం ఉపన్యసించే అవకాశమైనా దక్కినందుకు సంతృప్తి పడ్డాడతను.

శాస్త్రోక్తంగా సభ ప్రారంభమైంది.

ముందుగానే తర్ఫీదు పొందిన యాచక కన్వీనర్ తన విధిని సమర్థవంతంగా నిర్వహించాడు.

అధ్యక్షుని తొలి పలుకులలో ఆయాసం తన పట్టణంలోనే అవతరించడం తనకు గర్వ కారణంగా వున్నదని శాసనసభ్యులు భిక్షాలుగారు ఎలుగెత్తి చాటుకున్నారు.

సభా ప్రారంభకుని సందేశంలో ఆయాసం తన రాష్ట్రంలోనే ప్రారంభం కావడంవల్ల ఈ విషయంలో తన రాష్ట్రం మిగిలిన రాష్ట్రాలకి మార్గదర్శకం కాగలదని రాష్ట్రమంత్రి లోకనాధంగారు పారవశ్యంగా పలికారు.

కార్యవర్గ సభ్యుల ఎన్నిక, తీర్మానాలు...వగైరా కార్యక్రమాలన్నీ అజెండా ప్రకారం సక్రమంగా జరిగిపోతున్నాయి.

తర్వాత ముఖ్య అతిధి, కేంద్ర మంత్రి జగన్నాధంగారు లేచారు. ఆయున ఉపన్యాసం గంగా ప్రవాహంలా సాగిపోయింది.

''పెజలారా! నేను మీ మడిసిని. అంటే పెజల మడిసిని. నేను పెజాశావ కోసమే పుట్టాను. పెజాశావ చేసాను. పెజాశావ జేత్తుండాను. పెజాశావ చేత్తాను. పెజాశావే నా పేణం గనక పెజాశావ కోసమే నేను బతుకుతాను. పెజాశావ తప్ప ఇంకే పనీ నేను జెయ్యను. చెయ్యలేను. అదే నా పాలసీ. కనుకనే మీరు పిలవంగానే కాదనకుండా ఇక్కడికి లగెత్తుకొచ్చేసాను''

చప్పట్లు...నినాదాలు.

''జగన్నాధంగారికి జెయ్. ఆయాసం వర్ధిల్లాలి''

''మన దేశంలో ఉద్యోగులు సంగాలు బెట్టుకుంటూ వుండారు. నిరుజ్జోగులు బెట్టుకుంటూ వుండారు. కవులు బెట్టుకుంటూ వుండారు. కర్షకులు బెట్టుకుంటూ వుండారు. రైతు కూలీలు బెట్టుకుంటూ వుండారు. కులాల పేరిట, మతాల పేరిట అందరూ సంగాలు బెట్టుకుంటూ ఉండారు. యాచకులు మాత్తరం ఏం పాపం చేసారు? ఆళ్లు కూడా సంగం ఎందుకు బెట్టుకోకూడదు? అని నేను పెశ్నిత్తా వుండాను''

మళ్లీ చప్పట్లు...నినాదాలు.

''మనది పెజాసోమ్య దేశం గనక పెజలందరికీ సమాన అక్కులు వుండాలి. సంగాలు బెట్టుకునే అవకాశం అందరికీ వుండాలి. ఈ రోజున మీరు అయికమత్తెంతో సంగం బెట్టుకున్నారు. నా సొంత నియోజకవర్గంలోని టవున్లోనే ఈ సుబకార్యెం పేరంబోత్సవం గావడం నిజంగా నాకు శానా సంతోషంగా ఉంది. అయితే ఇది గ్రేమస్తాయిలోనే వుంది. తొరలోనే ఇది మండల, జిల్లా స్తాయిలు దాటి రాష్ట్ర స్తాయి, కేంద్ర స్తాయి గ్గూడా ఎదగాలని నేను మనసారా కోరతా వుండాను''

చప్పట్లు.

''మీలో సదూకున్నోళ్లున్నారు. మాటకారులున్నారు. కెమశిక్షణ తెలిసినోళ్లున్నారు. కార్యకరతలున్నారు. నేను జెప్తా వుండానుగందా ఓల్ మొత్తం పెపంచంలోనే మీకు పోటీ వచ్చే బిచ్చగాళ్లుండరు. భారతదేశపు బిచ్చగాళ్లంటేనే పెపంచమంతా గొప్పగా చెప్పుకునేటట్టు మీరు అబిరుద్ది జెందాలనీ, జెందుతారనీ నేను ఆసిత్తా వుండాను. అందుకు కావాల్సిన ఏర్పాట్లేవన్నా వుంటే అడగండి. రాష్ట్ర పెబుత్వం తరుపున లోకనాదంకారు జేత్తారు. కేంద్ర పెబుత్వం తరుపున నేను జేత్తా''

చప్పట్లు...నినాదాలు.

''మీ కోరికలన్నీ ఇన్నాను. అన్నీ సమంజసమైనియే. అయితే నిలకడగా ఒక చోట వుండకపోవడంవల్ల ఓటు అక్కును వినియోగించుకునే అవకాశం ఇంతవరకు మీకు లేకుండా పోయింది. వచ్చే ఎలచ్చన్ల నాటికి మీ అందరికీ ఓట్లొచ్చే ఏర్పాటు జెయ్యడమే కాకుండా ఎసంబిలీలో మీకొన్ని సీట్లు కేటాయించే ఇసయం కూడా సేను పయ్యోళ్లతో ఆలోసిత్తా''

చప్పట్లు...నినాదాలు.

''చివరగా నాదో మనవి. యాచకులంటే ఎవరు? అడుక్కునేవోళ్లు. అంతేకదా! ఈ దేశంలో అడుక్కోనివోడు ఎవడు? అని నేను పెశ్నిత్తా వుండాను. మా మట్టుకు మేము అడుక్కోటంలా ఓట్లు? మీకా




వలసింది మీరడుక్కుంటూ వుండారు. మాక్కావాలిసింది మేం అడుక్కుంటూ ఉండాం. ఎవుడిక్కావాలిసింది ఆడు అడుక్కుంటూ వుండాడు. అందరం అడుక్కునే వోళ్లమే. మనందరం సమానమే కనక వచ్చే ఎలచ్చన్లలో మీరంతా మన పార్టీకే అంటే మా పార్టీకే మీ పవిత్రమైన అమూల్యమైన ఓటేసి గెలిపించాలిసిందిగా ఇప్పుడే పేర్దిస్తా వుండాను. మళ్లీ మళ్లీ మీకు శావ చేసుకునే అవకాశం మాకు ఇప్పించాలిసిందిగా కోర్తా వుండాను. తప్పకుండా ఇస్తారని ఆశిస్తా ఉండాను. ఎన్నికైన యాచక సంగ కార్యవరగ సబ్యులకు నా సుబాకాంక్షలు''

''ఇది ఎన్నికల ప్రచార సభ అనుకుంటున్నారు కాబోలు పాపం మంత్రివర్యులు'' అన్న వ్యాఖ్య జనంలోంచి వినవచ్చింది. కాని చప్పట్ల హోరులో, నినాదాల గందరగోళంలో అది ఎంతోమంది చెవులకు సోకలేదు.

చివరగా జుశ్వేరా వంతు వచ్చింది. మైకు ముందుకు వచ్చీరావడంతోనే కవితావేశం వెల్లువలా పొంగి పొర్లిందతనిలో. కవితావేశానికి భాషా పాండిత్యం తోడు కావడంతో నిప్పుకు గాలి తోడైనట్లుంది. ఝురీ వేగంతో సాగిన కవిగారి ప్రసంగంలో ప్రస్తుత అప్రస్తుత విషయాలు అనేకం దొర్లిపోయినాయి. ఇన్స్పిరేషన్ కోసం మధ్య మధ్య 'ఆయాసం వర్ధిల్లాలి' అనే నినాదాలు మహోద్రేకంగా చెప్పించాడు.

పవిత్ర భారతదేశం భిక్షాటనకు ప్రసిద్ధి చెందిందన్నాడు. భిక్షాటనమే కుల వృత్తిగా స్వీకరించిన కుటుంబాలుగల ఘనత భారతదేశానికే దక్కిందన్నాడు. పరమశివుడే ఆదిభిక్షువు అన్నాడు. విష్ణుమూర్తి అంతటివాడు వామనావతారంలో బలి చక్రవర్తిని యాచించానన్నాడు. భిక్షువు-యాచకుడు పర్యాయపదాలే అన్నాడు. బౌద్ధ భిక్షువుల్ని కూడా రంగంలోకి లాక్కొచ్చాడు. పూర్వం యాచక వృత్తి పవిత్రమైనదిగా భావించబడేదని రొమ్ము విరుచుకుని చెప్పాడు. ఇప్పుడది తారుమారు కావడం కడంగడు శోచనీయం అని దీర్ఘంగా నిట్టూర్చాడు. ఈ దేశంలో అక్షర జ్ఞానం లేనివాళ్లూ, వాక్య నిర్మాణం చేతకానివాళ్లూ, భాషా సంప్రదాయాలు తెలీనివాళ్లు గ్రంథకర్తలుగా ప్రసిద్ధి చెంది డబ్బుకు డబ్బు, కీర్తికి కీర్తి సంపాదించేస్తున్నారని గుండెలు బాదుకున్నాడు. తన తోటి పాండితీ ప్రకాండులను ప్రభుత్వమూ, ప్రజలు, పత్రికలు ప్రచురణకర్తలు, ఎవ్వరూ గుర్తించడం లేదని కళ్లనీళ్లు పెట్టుకున్నాడు. ''అధిక విద్యావంతులు ప్రయోజకులైరి. పూర్ణ శుంఠలు, సభాపూజ్యులైరి'' అని పూర్వ కవి కొటేషన్ ఒకటి వినిపించాడు. అది విన్న సభాసదులు చేతులు నొప్పి పుట్టేలా చప్పట్లు చరిచారు. వేదిక నలంకరించిన నాయకమ్మన్యులు మాత్రం భుజాలు తడుముకున్నారు. చివరగా ఆయాసంపై తాను ప్రతిఫలరహితంగా రచించిన పంచరత్నాలను ఉచ్చై స్వరంలో రాగయుక్తంగా పాడి వినిపించి ఆయాసం రాగా అయిష్టంగానే మైకును వదిలిపెట్టాడు జుశ్వేరా.

సభాధ్యక్షులైన శాసనసభ్యులు భిక్షాలుగారు తమ అధ్యక్షుని మలి పలుకులతో ఆయాసం తమ పట్టణంలోనే పురుడు పోసుకోవడం నిజంగా తమ పట్టణ ప్రజలకు గర్వకారణమైన విషయమనీ, తమ పట్టణ చరిత్రలో ఇది సువర్ణాక్షరాలతో విధించవలసిన ఘట్టమనీ కంఠోక్తిగా చాటుకున్నారు.

ఇంకా కేంద్ర మంత్రివర్యులు నుడివినట్లుగా ఆయాసం గ్రామస్థాయి ఆర్గనైజేషన్ కాదనీ, రాష్ట్రంలోని యాచకులందరికీ ఇందులో సభ్యులుగా చేరే అవకాశం వుందనీ, అందుకనే దాని పేరు ఆయాసం అనగా 'ఆంధ్ర యాచక సంఘం'గా నిర్ణయించడం జరిగిందనీ, ఇది ముమ్మాటికీ రాష్ట్ర స్థాయి ఆర్గనైజేషనేనని పెద్దల అండదండల, ఆశీర్వాదాలతో అనతి కాలంలోనే దీన్ని ఆలిండియా యాచక సంఘంగా అభివృద్ధి చెయ్యగలమనీ ఉద్బోధించారు.

కొసమెరుపుగా ఆయాసం అన్న పొడి అక్షరాల పేరును ఆలిండియా యాచక సంఘం అనిపించుకోవడానికి క్కూడా అవకాశం వున్నదనీ, ముందు చూపుతో ఆలోచించే ఆయాసం అని నామకరణం చెయ్యడం జరిగిందనీ తన భాషా పాండిత్యాన్ని ప్రకటించి ముందుగా తనే చప్పట్లు కొట్టుకున్నారు శాసనసభ్యులు భిక్షాలుగారు.

కొత్తగా ఎన్నికైన ఆయాసం కార్యదర్శి వందన సమర్పణ చెయ్యడంతో సభ ముగిసింది. ★